సోమవారం

26-08-2024

# ముందడుగు

దినపత్రిక

సంపుటి: 1, సంచిక: 436 పేజీలు: 4 | ₹6

EPAPER.MUNDADUGU.COM


SIMULTANEOUSLY PUBLISHED FROM HYDERABAD | KARIMNAGAR | WARANGAL | JAGITYAL | KHAMMAM | NALGONDA | MAHABOOBNAGAR | NIZAMABAD

మీ ప్రాంతంలో జరిగే ఏలాంటి సమస్య ఐనా ముందడుగు దృష్టికి తీసుకురండి.. సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేద్దాం. మీ ప్రాంతంలో మీరు ముందడుగు పౌర పాత్రికేయుడిగా పనిచెయోచ్చు.. మీ సమస్యలపై స్పందించండి..

Mundadugu whatsapp:
9491114616
email: mundadugu111@gmail.com

## అధర్మం ఓడాలంటే యుద్ధం తప్పదు

- విలాసాల కోసం చెరువుల్లో ఫామ్‌హౌస్‌లు
- ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గేదిలేదు
- హరేకృష్ణ సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి



ముందడుగు హైదరాబాద్: అధర్మం ఓడాలంటే యుద్ధం తప్పదన్న కృష్ణుడి మాటలు తనకు స్ఫూర్తి అని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. హరేకృష్ణ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన అనంత శేష స్థాపన ఉత్సవంలో పాల్గొని ఆయన మాట్లాడారు. శ్రీకృష్ణుడి భగవద్గీత బోధనానుసారం చెరువులను కాపాడుతున్నామని తెలిపారు.

"చెరువులను చెరబట్టిన వాళ్ల నుంచి విముక్తి చేయాలనుకున్నాం. ఎంత ఒత్తిడి ఉన్నా వెనక్కి తగ్గకుండా అక్రమ నిర్మాణాలు కూలగొడుతున్నాం. చెరువులు ఆక్రమించిన వారి భరతం పడతాం. ప్రకృతి సంపదను విధ్వంసం చేస్తే ప్రకృతి మన మీద కక్ష కడుతుంది. అక్రమ నిర్మాణాలు చేసిన వ్యక్తులు ప్రభుత్వాన్ని ప్రభావితం చేసే స్థాయిలో ఉండవచ్చు.


ప్రభుత్వంలో ఉన్న వ్యక్తులు అక్రమ నిర్మాణాలు చేసినా కూల్చివేస్తాం. కొందరు శ్రీమంతులు విలాసాల కోసం చెరువుల్లో ఫామ్‌హౌస్‌లు నిర్మించారు. వాటి నుంచి వచ్చే డ్రైనేజీ నీరు చెరువుల్లో కలుపుతున్నారు. చెరువులు మన జీవనాధారం, సంస్కృతి. హైదరాబాద్‌ను రక్షించుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉంది" అని రేవంత్‌రెడ్డి అన్నారు.

## నిరసనల్లో పాల్గొన్న పాఠశాలలకు నోటీసులు

### పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం షోకాజ్ నోటీసులు జారీ




ముందడుగు పశ్చిమబెంగాల్: పశ్చిమబెంగాల్ కోల్‌కతాలోని ఆర్‌జీ కర్ వైద్య కళాశాల ఆసుపత్రి జూనియర్ వైద్యురాలిపై అత్యాచార ఘటన నిరసనల్లో పాఠశాలల విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొంటున్నారనే ఆరోపణలు రావడంతో బెంగాల్ ప్రభుత్వం సీరియస్ అయ్యింది. అనేక పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. "ఆగస్టు 23న పలు పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాఠశాల వేళల్లో ర్యాలీలో పాల్గొన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇలా విద్యార్థులు రోడ్లపైకి రావడం వారికి ఏ మాత్రం సురక్షితం కాదు. ఇది బాలల హక్కుల ఉల్లంఘన. ఈ విషయంపై పాఠశాలల యాజమాన్యాలు 24గంటల్లోగా నివేదిక సమర్పించాలి. లేదంటే కఠిన చర్యలు తీసుకుంటాం" అని రాష్ట్ర ప్రభుత్వం నోటీసుల్లో పేర్కొంది. హౌరా, బంకురా, మిడ్నాపూర్‌లోని పలు పాఠశాలలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ప్రభుత్వ నోటీసులు అందుకున్న హౌరాలోని ఓ ఉపాధ్యాయుడు మీడియాతో మాట్లాడుతూ పాఠశాల సమయంలో ర్యాలీ నిర్వహించలేదని, స్కూల్ సమయం ముగిసిన అనంతరం చేపట్టామన్నారు. అందులో పూర్వ విద్యార్థులు సైతం పాల్గొన్నారని తెలిపారు.



### షేక్ హసీనాపై 53 కేసులు

మిగతా 2లో



### తుపాకి స్కూల్‌కు వెళ్లిన పదేళ్ల బాలుడు

మిగతా 2లో



### ఎమర్జెన్సీ కాకున్నా.. సైరన్

మిగతా 4లో



### విజయ్ సేతుపతి జోడీగా జాతీయ ఉత్తమ నటి

మిగతా 5లో

## మహిళలపై నేరాలు క్షమించరానివని

- మహిళలపై నేరాలపై కఠినంగా వ్యవహరిస్తాం
- మహిళ చట్టాలను మరింత పటిష్ఠ పరుస్తున్నాం
- ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వ్యాఖ్యలు



ముందడుగు ఢిల్లీ: మహిళలపై నేరాలకు పాల్పడే వారిని విడిచిపెట్టబోమని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హెచ్చరించారు. మహారాష్ట్రలోని లఖ్‌పతి దీదీ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగించిన మోడీ..

మిగతా 2లో



## పాకిస్థాన్‌కు మోడీ లాంటి నాయకుడు కావాలి

### పాక్-అమెరికన్ వ్యాపారవేత్త సాజిత్ తరార్

ముందడుగు డెస్క్: పాకిస్థాన్‌కు మోడీ లాంటి నేత అవసరమని ప్రముఖ పాక్-అమెరికన్ వ్యాపారవేత్త సాజిత్ తరార్ పేర్కొన్నారు. దూరదృష్టితో గతంలో భారత్ తీసుకున్న నిర్ణయాలు ప్రస్తుతం ఫలాలు అందిస్తున్నాయని చెప్పారు. అమెరికా అధ్యక్ష

మిగతా 2లో

ముందడుగు
సోమవారం, 26-08-2024, హైదరాబాద్

## మహిళలపై నేరాలు క్షమించరానివని

(మొదటిపేజీ తరువాయి)

మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా శిక్షపడేలా చేస్తామని అన్నారు. ఇందుకోసం కఠిన చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నామని చెప్పారు. కోల్‌కతా వైద్య విద్యార్థిని హత్యాచారం, బద్లాపుర్ పాఠశాలలో లైంగిక వేధింపుల ఘటనలపై దేశవ్యాప్తంగా తీవ్ర ఆందోళనలు కొనసాగుతున్న వేళ ప్రధానమంత్రి ఇలా స్పందించారు. ''మహిళల భద్రత ఎంతో ముఖ్యమైనది. మహిళలపై నేరాలు క్షమించరానివని ప్రతి రాష్ట్రానికి చెబుతున్నా. నేరస్థులు ఎవ్వరైనా సరే.. వారిని విడిచిపెట్టే ప్రసక్తే లేదు. మహిళలపై నేరాలకు పాల్పడే వారిపై కఠినంగా శిక్షించేందుకు చట్టాలను మరింత పటిష్ఠపరుస్తున్నాం'' అని ప్రధాని మోడీ పేర్కొన్నారు.

## పాకిస్థాన్‌కు మోడీ లాంటి నాయకుడు కావాలి

(మొదటిపేజీ తరువాయి)

ఎన్నికలపై మాట్లాడుతూ.. ట్రంప్ విజయం సాధిస్తే అమెరికా పూర్వ వైభవం సాధిస్తుందన్నారు.
''భారత్‌తో పాటు అమెరికాలో పనిచేసే భారతీయులకు మోదీ ఇచ్చిన జాతీయవాద నినాదం ఎంతో ప్రయోజనం చేకూర్చింది. కొన్ని కీలక రంగాల్లో వారిదే పైచేయి. వాషింగ్టన్‌లో అది స్పష్టంగా కనిపిస్తుంది. టెక్ దిగ్గజాల పెరుగుదలతో ప్రవాస భారతీయులను మరింత బలోపేతం చేస్తోంది. దీని నుంచి పాకిస్థాన్ నేర్చుకొని.. విద్యపై ఎక్కువ దృష్టి పెట్టాలి'' అని అని పాకిస్థానీ-అమెరికన్ వ్యాపారవేత్త వెల్లడించారు. భారత తొలి ప్రధాని నెహ్రూ, నాటి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలామ్ ఆజాద్‌ల ఆలోచనలకు అనుగుణంగా ఏర్పడిన ఐఐటీ, ఐఐఎంలు దీర్ఘకాల ఫలితాలు ఇస్తున్నాయన్నారు. ఇలా దీర్ఘకాల లక్ష్యాలను దృష్టిలో పెట్టుకొని పెట్టుబడి పెడితే ఇలాంటి ఫలితాలే వస్తాయని ప్రశంసలు కురిపించారు.

# షేక్ హసీనాపై 53 కేసులు

### హసీనాతోపాటు పలువురిపై హత్యకేసులు



ముందడుగు జాతీయం:
బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై కేసుల సంఖ్య 53కు చేరింది. బంగ్లాదేశ్‌లో రైఫిల్స్‌లో 2010లో డిప్యూటీ అసిస్టెంట్ డైరెక్టర్‌గా అబ్దుల్ రహీం ఉన్న సమయంలో అక్కడి ఫీల్‌ఖానాలో మారణహోమం సంభవించింది. ఈ కేసులో ఆరోపణలు ఎదుర్కొన్న రహీం.. అదే ఏడాది జులై 29న జైల్లో మరణించాడు. దీనిపై రహీం కుమారుడు అబ్దుల్ అజీజ్ తాజాగా దాఖలు చేసిన పిటిషన్‌పై మాజీ ప్రధాని హసీనాపై అభియోగాలు మోపారు. జులై 18న చెలరేగిన హింసాత్మక ఘటనల్లో మిలటరీ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన విద్యార్థి ప్రాణాలు కోల్పోయిన ఘటనలో హసీనాతోపాటు మరో 48 మందిపై హత్యకేసు నమోదైంది. ట్రేడింగ్ కార్పొరేషన్‌కు చెందిన వ్యక్తితోపాటు ఆటోరిక్షా డ్రైవర్ మరణం కేసుల్లో హసీనాతోపాటు పలువురిపై హత్యకేసు నమోదైంది. మొత్తంగా హసీనా ప్రస్తుతం 53 కేసులు ఎదుర్కొంటున్నారు. వీటిలో 44 హత్య కేసులు, మారణహోమానికి సంబంధించి ఏడు, ఒకటి అపహరణతో పాటు బీఎన్‌పీ పార్టీ ఊరేగింపు సమయంలో చోటుచేసుకున్న ఘర్షణలో మాజీ ప్రధాని హసీనాపై దాడి కేసు నమోదయ్యింది.

## తుపాకి స్కూల్‌కు వెళ్లిన పదేళ్ల బాలుడు

### దేశ రాజధాని ఢిల్లీలో ఘటన




ముందడుగు ఢిల్లీ:
దేశ రాజధాని ఢిల్లీలోని ఓ పాఠశాలలో పదేళ్ల పిల్లాడు స్కూల్‌కు తుపాకి తీసుకురావడంతో తోటి విద్యార్థులు హడలిపోయారు. ఉపాధ్యాయులకు విషయం చెప్పగా వారు పిల్లాడి దగ్గరనుంచి తుపాకిని తీసుకొని పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కుటుంబసభ్యులను విచారించగా అది చిన్నారి తండ్రికి చెందినదని, అతడు కొన్ని నెలలక్రితం మరణించాడని పేర్కొన్నారు. తుపాకిని స్వాధీనం చేసుకున్న పోలీసులు లైసెన్సును రద్దు చేసే విధంగా చర్యలు చేపడుతున్నారు. తదుపరి విచారణ కొనసాగుతోందన్నారు.

ఇటీవల విద్యార్థులు పాఠశాలలకు తుపాకులను తీసుకువస్తున్న ఘటనలు తరచుగా వెలుగులోకి వస్తున్నాయి. ఈ ఏడాది మేలో ఉత్తరప్రదేశ్‌లో ఓ పదేళ్ల చిన్నారి ఇంట్లో దొరికిన పిస్టల్‌తో ఆడుకుంటూ ప్రమాదవశాత్తు తన 16 ఏళ్ల సోదరిని కాల్చి చంపాడు.

## వదంతులు, అవాస్తవాలు నమ్మకండి

- పట్టా భూమిలోనే కన్వెన్షన్ నిర్మించాం
- విజ్ఞప్తి చేసిన హిరో నాగార్జున





ముందడుగు హైదరాబాద్:
న్యాయస్థానం తీర్పు వెలువడే వరకూ ఎలాంటి వదంతులు, అవాస్తవాలు నమ్మొద్దని హీరో నాగార్జున విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోషల్ మీడియాలో పోస్ట్ పెట్టారు 'ప్రియమైన అభిమానులు, శ్రేయోభిలాషులకు.. N- కన్వెన్షన్‌కి సంబంధించి వస్తున్న వార్తల్లో వాస్తవాల కంటే ఊహాగానాలు ఎక్కువగా వినిపిస్తున్నాయి. పట్టా భూమిలోనే కన్వెన్షన్ నిర్మించాం. ఒక్క సెంట్ కూడా ఆక్రమించలేదు. తుమ్మిడికుంట చెరువు ఆక్రమణకు గురి కాలేదని స్పెషల్ కోర్టు, ఏపీ లాండ్ గ్రాబింగ్ యాక్ట్ 24-02-2014న ఓ ఆర్డర్ Sr 3943/2011 ద్వారా జడ్జిమెంట్ ఇచ్చింది. ప్రస్తుతం.. నిర్మాణం చట్టబద్ధతపై నిర్ణయాధికారం కోసం హైకోర్టుని ఆశ్రయించాం. న్యాయస్థానం తీర్పునకు కట్టుబడి ఉంటాను. అవాస్తవాలు నమ్మకండి'' అని ట్వీట్ చేశారు.

నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను హైడ్రా (హైదరాబాద్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ) బృందం శనివారం ఉదయం నేలమట్టం చేసిన సంగతి తెలిసిందే. తుమ్మిడి చెరువు కబ్జా చేసి ఆ నిర్మాణం చేపట్టారని అధికారుకుల ఫిర్యాదులు రాగా కూల్చివేశారు. చట్టాన్ని ఉల్లంఘించేలా తాము ఎటువంటి చర్యలు చేపట్టలేదని సోషల్ మీడియా వేదికగా నాగార్జున నిన్ననే ఓ ప్రకటన విడుదల చేశారు. తాజాగా మరోసారి పోస్ట్ పెట్టారు. కన్వెన్షన్ కూల్చివేతపై నాగార్జున తెలంగాణ హైకోర్టును శనివారమే ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ టి.వినోద్ కుమార్ విచారణ చేపట్టారు. ఈ క్రమంలో కూల్చివేతలు ఆపాలని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

## శ్రీశైలంలో మద్యం, మాంసానికి చెక్

### ప్రతి వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

ముందడుగు శ్రీశైలం:
శ్రీశైలం మల్లికార్జునస్వామిని దర్శించుకునేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివస్తున్నారు. వరుస సెలవుల కారణంగా ఆదివారం భక్తుల రద్దీ పెరిగింది. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. ఆలయ పవిత్రతను కాపాడేందుకు ఆలయ పరిసర ప్రాంతాలకు మద్యం, మాంసం తీసుకురాకుండా పోలీసులు గట్టి చర్యలు తీసుకుంటున్నారు. ఇందులో భాగంగా ఆదివారం సీఐ ప్రసాద్ రావు ఆధ్వర్యంలో ఆలయ ముఖద్వారం వద్ద వాహనాలను తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన సరైన పత్రాలు లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ గురవయ్య, కానిస్టేబుళ్లు రఘునాథ్, బాలకృష్ణ, మహేశ్, శివమహేంద్ర రెడ్డి, నాను నాయక్ తదితరులున్నారు.

ముందడుగు
సోమవారం,
26-08-2024,
హైదరాబాద్

## అనాథలు, నిరాశ్రయులకు
# 259వ అన్నదాన కార్యక్రమం



ముందడుగు హైదరాబాద్:
ఆకలితో అలమటిస్తూ అనాథలు, నిరాశ్రయులు ఎందరో రాష్ట్ర రాజధాని మహానగరం భాగ్యనగరం రోడ్ల పక్కన ఫుట్ పాత్ల మీద జీవనం సాగిస్తున్నారు. ఆకలితో అలమటిస్తున్న నిరాశ్రయులు, అనాథలు, అభాగ్యులను గుర్తించి వారికీ ఆహారం అందించారు. క్రమం తప్పకుండా నిర్విరామంగా కొనసాగిస్తున్న అన్నదాన కార్యక్రమాలు నేటితో 259 వ అన్నదాన కార్యక్రమానికి చేరుకుంది. అనాథలను, నిరాశ్రయులను గుర్తించి వారికి ఆశ్రయం కలిపించి, ఆహారం, వైద్యం, బట్టలు అందించింది వారి జీవితం వాళ్ళు బ్రతికేలా ప్రభుత్వం ప్రత్యేక శాఖను ఏర్పాటు చేసి చిన్నతరహా కుటీరపరిశ్రమలు నెలకొల్పి స్వయం ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ అన్నదాన కార్యక్రమంలో ప్రెసిడెంట్ వై.సంజీవ కుమార్, వైస్ ప్రెసిడెంట్ ఓ.పావని. సేవాసభ్యులు అఖిల్, హరీష్, సాయిరాం, సాయితేజ, ఆర్. లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

# నిజాయితీ అధికారుల సమాచారం ఇవ్వండి
## సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్




ముందడుగు హైదరాబాద్:
సమాజంలో నిజాయితీగా పనిచేసిన, పనిచేస్తున్న అధికారుల సమాచారాన్ని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థకు అందించాలని యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సలహాదారులు, ప్రముఖ సంగీత దర్శకుడు ఆర్పీ పట్నాయక్ ప్రజలను కోరారు. అదివారం యూత్ ఫర్ యాంటీ కరప్షన్ కేంద్ర కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరణ చేసి మాట్లాడారు. సమాజంలో రోజురోజుకు అవినీతి పెరిగిపోతున్నదని, దానిని నిర్మూలించే క్రమంలో నిజాయితీగా పనిచేసే వారిని గుర్తించి సత్కరిస్తూ నేటి తరానికి పరిచయం చేయబోతున్నామని తెలిపారు. మన చుట్టూ ఎంతోమంది నిజాయితీగా పనిచేస్తున్నారనే విషయం చాలా మందికి తెలియదని, అలాంటి వారిని గురించి యువతరానికి స్ఫూర్తిగా నిలిచే బాధ్యతను మా సంస్థ తీసుకుందన్నారు. యూత్ ఫర్ యాంటీ కరప్షన్ పౌండర్ రాజేంద్ర పల్నాటి మాట్లాడుతూ దేశంలోనే యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సంస్థ వినూత్న కార్యక్రమాలను చేపడుతుందని, అందులో భాగంగానే నిజాయితీపరుల సంఖ్యను పెంచే కార్యక్రమం అన్నారు. అవినీతి రహిత సమాజం విడతల వారీగా నిజాయితీ అధికారులను, నాయకులను, సర్పంచులను సత్కరిస్తున్నామన్నారు. సెప్టెంబర్ 1న నిజాయితీ అధికారుల కార్యక్రమాన్ని హైదరాబాద్ లో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూత్ ఫర్ యాంటీ కరప్షన్ సభ్యులు కొమటి రమేశ్ బాబు, బత్తిని రాజేశ్, జి. హరిప్రకాశ్ పాల్గొన్నారు.

## దెయ్యాన్ని వదిలిస్తానని
# వ్యక్తిని కొట్టి పాస్టర్
## దెబ్బలకు తాళలేక మృతి చెందిన వ్యక్తి



ముందడుగు పంజాబ్:
పంజాబ్‌లోని గురుదాస్‌పూర్ జిల్లాలో 30 ఏళ్ల శామ్యూల్ మాసిహ్ రోజువారీ కూలీగా పని చేస్తున్నాడు. అతడు మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నేపథ్యంలో తమ ఇంట్లో ప్రార్థన నిర్వహించాలని పాస్టర్ జాకబ్ మాసిహ్‌ను శామ్యూల్ కుటుంబం కోరింది. ఈ నెల 21న పాస్టర్ జాకబ్ తన అనుచరులతో కలిసి ఆ ఇంటికి వచ్చాడు. శామ్యూల్ శరీరంలోకి దెయ్యం ప్రవేశించిందని దానిని వదిలిస్తానని అతడి కుటుంబ సభ్యులతో చెప్పాడు. తన అనుచరులతో కలిసి శామ్యూల్‌ను దారుణంగా కొట్టాడు. దీంతో అతడు అక్కడికక్కడే చనిపోయాడు. మరోవైపు శామ్యూల్ మృతదేహానికి కుటుంబ సభ్యులు అంత్యక్రియలు నిర్వహించారు. ఆ తర్వాత పాస్టర్ జాకబ్‌పై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో శనివారం శామ్యూల్ మృతదేహాన్ని వెలికితీశారు. పోస్ట్‌మార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పాస్టర్ జాకబ్ మసీహ్ అతడి అనుచరులైన బల్జీత్ సింగ్, సోను, ఇతరులపై భారతీయ న్యాయ సంహిత సెక్షన్ల కింద పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై దర్యాప్తు చేస్తున్నారు.

## కులాల మధ్య చిచ్చు పెడితే
# సహించేది లేదు
## రెడ్డి సంఘాల ఐక్యవేదిక మహిళ అధ్యక్షురాలు స్వప్నారెడ్డి



ముందడుగు హైదరాబాద్:
రాజ్యాంగబద్ధ పదవిలో ఉండి, రాజకీయ లబ్ధి కోసం, క్యూ న్యూస్ను అడ్డుపెట్టుకొని ఈడబ్ల్యూఎస్ 10% రిజర్వేషన్లపై అసత్య ప్రచారాలతో, కులాల మధ్య చిచ్చు పెడుతున్న తీన్మార్ మల్లన్న శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని రెడ్డి సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర మహిళ అధ్యక్షురాలు దేవిరెడ్డి స్వప్నారెడ్డి డిమాండ్ చేశారు. రాజ్యాంగబద్ధ పదవిలో కొనసాగుతున్న శాసనమండలి సభ్యుడు తీన్మార్ మల్లన్న తన క్యూ న్యూస్ ఛానల్ ద్వారా 2019లో కేంద్ర ప్రభుత్వం అగ్రవర్ణ పేదలకు విద్యా ఉద్యోగాలలో 10% రిజర్వేషన్లు కల్పించడానికి పార్లమెంటులో రాజ్యాంగ సవరణ ద్వారా ఆమోదించి అమలు చేస్తున్న రిజర్వేషన్లపై అగ్రవర్ణ పేదలకు నష్టం కలిగించే విధంగా, వాస్తవాలకు విరుద్ధంగా తనకు తెలిసిన కులాల జనాభా కాకి లెక్కలు చెబుతూ, ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లపై వాస్తవాలను వక్రీకరిస్తూ విషం చిమ్ముతూ కులాల మధ్య చిచ్చు పెడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకొని శాసనమండలి సభ్యత్వ పదవిని రద్దు చేయాలని, అప్పటివరకు ఆందోళన కొనసాగిస్తామని హెచ్చరించారు.

## ‘ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్’పై
# నామినేషన్స్

inspire awards - manak

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్, రెసిడెన్షియల్, కేంద్ర విద్యాలయాల పాఠశాలు, ప్రాథమికోన్నత పాఠశాలలు, ఉన్నత పాఠశాలల యాజమాన్యాలు కచ్చితంగా తమ పాఠశాలల నుంచి ఐదుగురు విద్యార్థులకు ‘ఇన్‌స్పైర్ అవార్డ్స్ మానక్ 2024-25’ నామినేషన్స్ చేయాలని జిల్లా విద్యాశాఖధికారిని రోహిణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నామినేషన్ ప్రక్రియపై ఏమైనా సందేహాలు ఉంటే జిల్లా సైన్స్ అధికారి ధర్మేందర్ రావు 7799171277, 7981 950513, 6300869388 నంబర్లలో సంప్రదించాలని రోహిణి సూచించారు.


ముందడుగు
సోమవారం, 26-08-2024, హైదరాబాద్



## ఇప్పటికీ 18 కట్టాలు కూల్చివేత.. ప్రభుత్వానికి హైడ్రా నివేదిక

ఇప్పటి వరకు నగరంతో పాటు శివారు ప్రాంతాల్లో కూల్చివేతల వ్యవహారంపై ప్రభుత్వానికి హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్స్ మానిటరింగ్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (HYDRA) ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. శనివారం నాటికి 18 ప్రాంతాల్లో కూల్చివేతలు నిర్వహించినట్లు నివేదికలో పేర్కొన్నది. ఈ క్రమంలో 43.94 ఎకరాల ఆక్రమిత భూమిని తిరిగి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొంది. టాలీవుడ్ నటుడు నాగార్జునకు చెందిన ఎన్ కన్వెన్షన్‌ను సైతం కూల్చివేసినట్లు తెలిపింది.

కూల్చివేతల జాబితాలో ప్రొ కబడ్డీ లీగ్ ఓనర్ అనుపమ భవనం, కావేరి సీడ్స్ యజమాని భాస్కర్‌రావు నిర్మాణాలు ఉన్నాయని చెప్పింది. అలాగే, మంథనికి చెందిన బీజేపీ నేత సునీల్‌రెడ్డి నిర్మాణాన్ని కూల్చివేశామని చెప్పింది. ఎంఐఎం ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ఆక్రమించిన 12 ఎకరాలు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపింది. బహదూర్‌పురా ఎమ్మెల్యే మహ్మద్ ముబీన్‌కు చెందిన ఐదంతస్తుల భవనం, ఎంఐఎం మహ్మద్ మీర్జా భవనాన్ని కూల్చివేసినట్లు హైడ్రా తన నివేదికలో వెల్లడించింది. నందగిరి హిల్స్‌లోని ఎమ్మెల్యే దానం మద్దతుదారుడి భవనం, చింతల్ బీఆర్ఎస్ నేత రత్నాకరం సాయిరాజు షెడ్డు, కాంగ్రెస్ నేత పళ్లంరాజు సోదరుడి నిర్మాణం కూల్చివేసినట్లు చెప్పింది.



# ఎమర్జెన్సీ కాకున్నా.. సైరన్

- చిన్నచిన్న కారణాలకే మోగిస్తూ.. దూసుకెళ్తున్న అంబులెన్స్‌లు
- 49 శాతం శాంపిళ్ల కోసమేనట..
- ట్రాఫిక్ పోలీసుల సర్వేలో పలు అంశాలు గుర్తింపు
- సైరన్‌ను దుర్వినియోగం చేయొద్దు
- అంబులెన్స్ డ్రైవర్లకు పోలీసుల స్పష్టీకరణ
- స్వీయ నియంత్రణ అవసరమంటూ.. హితవు
- అత్యవసర సమయాల్లోనే సైరన్ వాడాలంటూ సూచన

రోగికి అత్యవసర సమయంలో వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరం ఉంటుంది. ఆ సమయంలో ట్రాఫిక్ పోలీసులు సైతం రూట్ క్లియర్ ఇస్తుంటారు. అయితే ఇటీవల ట్రాఫిక్ పోలీసులు నిర్వహించిన సర్వేలో చాలా సందర్భాల్లో అత్యవసర సమయం కానప్పుడు కూడా అంబులెన్స్ డ్రైవర్లు.. సైరన్లు వాడుతూ.. వెళ్తున్నట్లు గుర్తించారు. చికిత్స అనంతరం రోగిని ఇంటికి తీసుకెళ్లే సమయంలో.. అనారోగ్యంతో ఉన్న వ్యక్తులు.. ఉద్యోగులు.. వివిధ రకాల శాంపిళ్ల కలెక్షన్లు.. మృతదేహాలను తరలించేటప్పుడు.. ఇలా అంబులెన్స్ డ్రైవర్లు సైరన్‌ను ఉపయోగిస్తున్నట్లు తేలింది. అత్యవసర సమయాల్లోనే సైరన్‌ను వాడాలని.. దుర్వినియోగం చేయవద్దని డ్రైవర్లకు నగర ట్రాఫిక్ పోలీసులు సూచిస్తున్నారు. - ముందడుగు





ట్రాఫిక్ పోలీసులు అంబులెన్స్ సర్వీస్‌లకు సంబంధించిన సైరన్‌ను ఎలా వాడుతున్నారు..దాని దుర్వినియోగంపై ఒక సర్వే చేశారు. ఇందుకు గత నెల 23వ తేదీ నుంచి 27వ తేదీ మధ్యలో అక్కడక్కడ జంక్షన్ల వద్ద 310 అంబులెన్స్ సేవల గురించి ఆరా తీశారు. అందులో అత్యధికంగా 152 అంబులెన్స్‌లు (49%) శాంపిళ్లను తీసుకొని వెళ్తున్నవే ఉన్నాయి.. అలాగే వివిధ కారణాలు చెప్పినవి 121 (39%), మృతదేహాలను తీసుకెళ్తున్నవి 20 (6.5%), ఖాళీగా వెళ్తున్నవి 17 (5.5%) ఉన్నట్లు తేలింది. ఇలా సగానికిపైగా అంబులెన్స్‌ల సైరన్లు దుర్వినియోగం అవుతున్నట్లు పోలీసులు గుర్తించారు. రోగికి అత్యవసరంగా వైద్యసేవలు అందించేందుకు సైరన్‌ను వాడుతూ.. అందరి సహకారంతో అంబులెన్స్‌లు వేగంగా వెళ్లాల్సిన అవసరముంటుంది. అయితే ఆ రోగికి అత్యవసరం కాకున్నా..అంబులెన్స్ ఉందంటే సైరన్ వేసుకొని వెళ్లేవారు చాలా మంది ఉంటున్నారు. రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు.. ఎవరైనా ప్రాణాపాయ స్థితిలో ఉంటే.. అప్పుడే పుట్టిన పసిపాపలు.. ఇలా కొన్ని సందర్భాల్లో తప్పని సరిగా అంబులెన్స్ సైరన్ వాడాల్సిందేనని పోలీసులు సూచిస్తున్నారు. రోగి చికిత్స అనంతరం అంబులెన్స్‌లో ఇంటికి వెళ్తుండడం, మృతదేహాలను తరలించడం, అనారోగ్యంగా ఉన్న వారిని, ఉద్యోగులు, వివిధ రకాలైన శాంపిళ్లను తీసికెళ్లే సమయంలోనూ అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని నగర ట్రాఫిక్ అదనపు సీపీ విశ్వప్రసాద్ సూచనలు చేస్తున్నారు.

### ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు

అంబులెన్స్ సైరన్‌తో వెళ్తుంటే.. రోడ్డుపై వెళ్లే వాహనదారులతో పాటు జంక్షన్ల వద్ద పోలీసులు ట్రాఫిక్ క్లియరెన్స్ ఇస్తుంటారు. ఆటోమెటిక్ వ్యవస్థ ఉన్న చోట ట్రాఫిక్ పోలీసులు అప్పటికప్పుడు సిగ్నళ్లను మాన్యువల్‌గా మార్చేసి అంబులెన్స్‌లకు దారిస్తుంటారు. ఇలా ఒక గంటలో ఒక జంక్షన్ నుంచి 5 నుంచి 6 అంబులెన్స్‌లు వెళ్తుంటాయి. ఆ సమయంలో ఆటోమెటిక్ నుంచి మాన్యువల్ మోడ్‌కు సిగ్నల్ వ్యవస్థను మార్చాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలోనే కొన్ని అంబులెన్స్‌లు నాన్ ఎమర్జెన్సీ సందర్భాల్లోనూ సైరన్ మోగిస్తున్నట్లు ట్రాఫిక్ పోలీసులు సర్వే ద్వారా గుర్తించారు.

### త్వరలోనే సాఫ్ట్‌వేర్

అంబులెన్స్ డ్రైవర్లకు అవగాహన కల్పించడంలో భాగంగా ఇటీవల కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌లో హాస్పిటళ్ల యాజమాన్యాలు, ప్రైవేట్ అంబులెన్స్ అసోసియేషన్స్, అంబులెన్స్‌లు కలిగి ఉన్న డయాగ్నోస్టిక్ ల్యాబొరేటరీస్ యాజమాన్యాలతో నగర ట్రాఫిక్ పోలీస్ అదనపు సీపీ విశ్వప్రసాద్ నేతృత్వంలో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. అంబులెన్స్ సైరన్‌ను దుర్వినియోగం చేయవద్దని, అత్యవసర పరిస్థితులు, అత్యవసరం కాని పరిస్థితులను వేర్వేరుగా చూడాలని సూచించారు. ఇందుకు స్వీయ నియంత్రణ అవసరమని అంబులెన్స్ డ్రైవర్లు, దవాఖానల యాజమాన్యాలకు సూచించారు. ఎమర్జెన్సీ, నాన్ ఎమర్జెన్సీలకు సంబంధించిన ఏర్పాట్ల విషయంలో ఒక సాఫ్ట్‌వేర్ అప్లికేషన్‌ను తయారు చేస్తున్నామని, త్వరలోనే దానిని అందుబాటులోకి తీసుకొస్తామని చెప్పారు.

ముందడుగు
సోమవారం, 26-08-2024, హైదరాబాద్

# వర్క్ మూడ్.. కమల్ హాసన్ థగ్ లైఫ్ అప్‌డేట్ ఇచ్చిన శింబు



కోలీవుడ్ స్టార్ హీరో శింబు ప్రస్తుతం బ్యాక్ టు బ్యాక్ సినిమాలను లైన్‌లో పెట్టాడని తెలిసిందే. వీటిలో ఒకటి కీలక పాత్రలో నటిస్తోన్న 'థగ్ లైఫ్' (Thug life). మణిరత్నం దర్శకత్వంలో వస్తోన్న కమల్ హాసన్ ప్రధాన పాత్రలో నటిసోన్న ఈ మూవీ KH234గా తెరకెక్కుతోంది. థగ్ లైఫ్‌లో ఐశ్వర్యలక్ష్మి, త్రిష, ఫీ మేల్ లీడ్ రోల్స్‌లో నటిస్తుండగా.. పాపులర్ మాలీవుడ్ యాక్టర్ జోజు జార్జ్, గౌతమ్ కార్తీక్, దుల్కర్ సల్మాన్, జయం రవి ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమా అప్‌డేట్ ఎప్పుడొస్తుందా అని ఎదురుచూస్తున్న వారి కోసం చాలా రోజుల తర్వాత ఆసక్తికర వార్తను షేర్ చేశారు మేకర్స్. వర్క్ మూడ్.. అంటూ లొకేషన్‌లో దిగిన స్టిల్‌ను సోషల్ మీడియా ద్వారా షేర్ చేశాడు శింబు. వైట్ అండ్ వైట్ డ్రెస్‌లో ఉన్న శింబు లుక్ ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతోంది. థగ్ లైఫ్‌లో శింబు పాత్ర ఎలా ఉండబోతుందో తెలియజేస్తూ.. Sigma Thug Rule అంటూ విడుదల చేసిన వీడియోలో శింబు స్టైలిష్‌గా కనిపించబోతున్నట్టు చెప్పకనే చెబుతున్నాయి విజువల్స్. శింబు ఇన్నోవాలో కొత్త క్రిమినల్ రూపంలో పిస్తోల్ చేతబట్టుకొని స్టైలిష్ ఎంట్రీ ఇస్తున్న విజువల్స్ సినిమాపై అంచనాలు పెంచేస్తూ..సూపర్ బజ్ క్రియేట్ చేస్తున్నాయి.

మేకర్స్ థగ్ లైఫ్ టీంతో కట్ చేసిన వీడియో నెట్టింట చక్కర్లు కొడుతోంది. ఈ మూవీకి ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్, బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ అందిస్తుండగా.. కమల్ హాసన్-ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో రాజ్‌కమల్ ఫిలిం ఇంటర్నేషనల్, రెడ్ జియాంట్ మూవీస్, మద్రాస్ టాకీస్ బ్యానర్లపై కమల్ హాసన్-ఆర్ మహేంద్రన్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



# విజయ్ సేతుపతి జోడీగా జాతీయ ఉత్తమ నటి

ఇటీవల ప్రకటించిన జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో ఉత్తమ నటిగా అవార్డును కైవసం చేసుకుంది అగ్ర కథానాయిక నిత్యామీనన్. తమిళ చిత్రం 'తిరుచిత్రాంబలమ్'కు గాను ఆమె ఈ అవార్డును గెలుచుకుంది. తాజాగా ఈ అమ్మడు తమిళంలో మరో భారీ ఆఫర్ సొంతం చేసుకుంది. అగ్ర నటుడు విజయ్ సేతుపతికి జోడీగా నిత్యామీనన్ నటించనుంది. పాండిరాజ్ దర్శకత్వంలో ఫ్యామిలీ డ్రామాగా ఈ చిత్రాన్ని తెరకెక్కించబోతున్నారు. శుక్రవారం ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడింది. సత్యజ్యోతి ఫిల్మ్స్ నిర్మించనున్న ఈ సినిమా త్వరలో సెట్స్‌మీదకు వెళ్లనుంది ఇటీవల విడుదలైన 'మహారాజ' సినిమా సక్సెస్‌తో విజయ్‌సేతుపతి కెరీర్‌లో దూసుకుపోతున్నారు. మరోవైపు జాతీయ అవార్డుతో నిత్యామీనన్ సత్తా చాటింది. ఈ ఇద్దరు వెర్సటైల్ ఆర్టిస్టుల కాంబినేషన్‌లో సినిమా వస్తుండడంతో అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.